క్లుప్తంగా

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



కొత్త అగ్రహారంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి తరణి

కె.కోటపాడు : సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది సూచించే ఆరోగ్య జాగ్రత్తలను ప్రజలు పాటించాలని వైద్యాధికారి తరణి అన్నారు. కొత్త అగ్రహారం గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 133 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వేడిచేసి చల్లార్చిన నీటిని తీసుకోవడంతో పాటు వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యాధికారి రోగులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ అచ్చియ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్‌ఎం చిన్నమ్మలు పాల్గొన్నారు.

నిలకడగా తాండవ నీటి మట్టం



తాండవ రిజర్వాయర్ నీటి నిల్వలు

నాతవరం: తాండవ రిజర్వాయర్ నీటి మట్టంపై దానా తుపాను ప్రభావం లేదని ప్రాజెక్టు జేఈ ప్రేమకుమార్ అన్నారు. ప్రాజెక్టులో మంగళవారం నాటికి 377.2 అడుగుల నీటి మట్టం ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి పంట కాలువల ద్వారా ఆయకట్టు భూములకు రోజుకు 550 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటి మట్టం 380 అడుగులుగా పరిగణిస్తామన్నారు. వాతావరణ పరిస్థితులను బట్టి స్పిల్‌వే గేట్ల ద్వారా నదిలోకి నీరు విడుదల చేస్తామన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

బుచ్చెయ్యపేట: విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన అందించాలని డిప్యూటీ డీఈవో అప్పారావు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన తురకలపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి ఇప్పటి వరకు సబ్జెక్ట్‌ల వారీగా అయిన పాఠాల వివరాలను ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలిసికున్నారు. హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ఏ సమస్య లేకుండా చూడాలని ఎంఈవో విశ్వేశ్వరరావు, హెచ్‌ఎం రవీంద్రబాబుకు సూచించారు.

రాజ్యాంగం, చట్టాలపై అవగాహన తప్పనిసరి

దేవరాపల్లి: విద్యార్థి దశ నుండి రాజ్యాంగం, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, జిల్లా విజిలెన్స్ అండ్ మెనిటరింగ్ కమిటీ సభ్యుడు కె.వి.రమణ సూచించారు. ఈ మేరకు దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను అధ్యక్షతన భారత రాజ్యాంగం, చట్టాలపై అవగాహన సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ రాజ్యాంగం, చట్టాలపై పరిపూర్ణ అవగాహన కలిగి ఉంటే ఉత్తమ పౌరులుగా ఎదగడంతో పాటు నవ సమాజం నిర్మితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



స్పీకర్ అయ్యన్నపాత్రుడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ గోవిందరావు

నర్సీపట్నం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన టౌన్ సీఐ గోవిందరావు మంగళవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పీకర్ సీఐకి సూచించారు. గంజాయి సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని, కఠినంగా వ్యవహరించాలని స్పీకర్ తెలిపారు.

రోడ్డు అంచున పొంచి ఉన్న ముప్పు

ప్రమాదకరంగా క్వారీలు • ఆదమరిస్తే అనంత లోకాలకే..... • రక్షణ గోడల ఎత్తు పెంచాలని వాహనదారుల వినతి



లంకవానిపాలెం వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా క్వారీ



పింద్రంగి వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా భూగర్భ క్వారీ

కె.కోటపాడు : మండలంలో లంకవానిపాలెం-పింద్రంగి గ్రామాల మధ్య రోడ్డును ఆనుకుని ఉన్న భూగర్భ క్వారీలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. గత 25ఏళ్ల క్రితం లంకవానిపాలెం గ్రామ సమీపంలో గల భూగర్భ క్వారీలు నిర్వహించేవారు. నిర్వహణ పూర్తి కావడంతో ప్రస్తుతం ఈ క్వారీని నిలుపుదల చేశారు. ఈ భూగర్భ క్వారీలు లంకవానిపాలెం, పింద్రంగి వెళ్లే రోడ్డు మార్గాన్ని ఆనుకుని మలుపుల ప్రాంతాల వద్ద ఉన్నాయి. రోడ్డు అంచులను ఆనుకునే ఈ ప్రమాదకర క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం రోడ్డు అంచున ఆనుకుని సుమారు 50 నుంచి 70 అడుగుల లోతుగా ఈ భూగర్భ క్వారీలు ఉన్నాయి. ఈ మార్గంలో తరచూ ప్రయాణాలు సాగించే వాహనదారులు ఈ క్వారీల ప్రాంతాల వద్ద జాగ్రత్తలు వహించి ప్రయాణాలు సాగిస్తుంటారు. నాలుగేళ్ల క్రితం దీక్షితుల అగ్రహారం గ్రామానికి చెందిన చిన్నారి ప్రమాదవశాత్తూ ఈ రోడ్డు అంచున ఆనుకుని ఉన్న ఈ భూగర్భ క్వారీలో పడడంతో మృత్యువాతపడింది. రైతులు మేతకు తీసుకువెళ్లే పశువులు కూడా ఈ క్వారీల్లో పడి మృత్యువాత పడుతున్నాయి.

అడుగున్నర ఎత్తులోనే రక్షణ గోడ

గతంలో క్వారీల నిర్వహణ సమయంలో రోడ్డు అంచునకు కేవలం అడుగున్నర ఎత్తులో మాత్రమే రక్షణగోడల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ మార్గంలో ప్రస్తుతం అధిక బరువుతో కూడిన వాహనాలతో పాటు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ద్విచక్రవాహనాలు, ఆటోలపై రాకపోకలను చేస్తున్నారు. అధికారులు గుర్తించి ఆయా క్వారీల వద్ద రక్షణగోడల ఎత్తు పెంచి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ మార్గంలో మలుపుల వద్ద గల ఈ భూగర్భ క్వారీలను గుర్తించే విధంగా ఆర్‌అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే...



లంకవానిపాలెం-పింద్రంగి మార్గంలో ఉన్న భూగర్భ క్వారీలు అత్యంత ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. మలుపుల్లో ఉన్న ఈ క్వారీలను గుర్తించి వాహనాలను అదుపుచేసే లోపుగానే ప్రమాదాలకు గురికావల్సిన పరిస్థితులు ఉన్నాయి. భూగర్భ క్వారీల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం జరపాలి.

–వేచలపు కాసుబాబు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, కె.కోటపాడు

గ్రామ సభలతో సమస్యల పరిష్కారం



డొంకాడ అగ్రహారంలో మాట్లాడుతున్న డీటీ శివ



వీరవల్లి సచివాలయంలో మాట్లాడుతున్న తహశీల్దారు రమాదేవి



సీతంపేటలో అర్జీలు స్వీకరిస్తున్న డీటీ గపూర్

నాతవరం: భూ రీసర్వే చేసేటప్పుడు లోపాలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే సరి చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శివ అన్నారు. మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీ శివారు డొంకాడ అగ్రహారంలో రామాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో జరిగిన లోపాలు సరి చేయడానికే రెవెన్యూ గ్రామసభల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సదస్సులో 20 మంది రైతులు భూసమస్యలపై అర్జీలు సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ డి.ప్రసాద్, వీఆర్‌వో, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై రైతులకు అవగాహన..

రోలుగుంట: వై.బి.పట్నంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ శంకర్రావు భూ సమస్యలు, వాటి పరిష్కారం గురించి రైతులకు అవగాహన కల్పించారు. భూ సమస్యలకు సంబంధించి ఎనిమిది అర్జీలు తీసుకున్నారు. రైతుల సందేహాలు నివృత్తి చేశారు. ఆర్.ఐ. రామ్మూర్తి రైతుల సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ తవిటినాయుడు, సిబ్బంది తదితరులు పాల్గున్నారు.

వీరవల్లి సచివాలయంలో..

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం పంచాయతీ పరిధిలో గల లక్ష్మీపురం రెవెన్యూకు సంబంధించి మంగళవారం స్థానిక తహశీల్దారు కె. రమాదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించగా 6 అర్జీలు అందాయి. సర్వేయర్ సాయికుమారీ, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

దేవరాపల్లి: నాగయ్యపేట పంచాయితీ పరిధిలోని సీతంపేటలో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ గపూర్‌కు వివిధ భూ సమస్యలపై 19 అర్జీలు అందాయి. వీటికి వీలైనంత త్వరగా పరిష్కార మార్గం చూపిస్తామని ఆయన స్పష్టం చేశారు. మండల సర్వేయర్ జి. గోవిందరాజులు, వీఆర్‌వో జాన్సీ, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

రొంగలినాయుడుపాలెంలో..

కె.కోటపాడు: రీసర్వే గ్రామసభల ద్వారా రెవెన్యూ సంబంధిత సమస్యలకు పరిష్కారం లభించనున్నట్లు తహసీల్దార్ భాగ్యావతి అన్నారు. రొంగలినాయుడుపాలెంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. పాస్ పుస్తకాలలో ఆధార్ నంబర్, భూ విస్తీర్ణం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, రైతుల పేర్ల నమోదులో తప్పొప్పుల సవరణలకు 38 మంది అర్జీలు అందించారు. సర్పంచ్ పైల పైడితల్లమ్మ, ఎంపీటీసీ రామలక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సూరి తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రంతో ఆదాయం

మాడుగుల రూరల్ : చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలు ఆదాయం పొందవచ్చని స్థానిక ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండలంలో ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, గ్రామాల్లో గల చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. రోడ్ల మీద చెత్త, చెదారాలు వేయరాదని, వాటిని చెత్త బండ్లకు అందజేయాలని ప్రజలకు సూచించారు. ఈ చెత్తను సంపద కేంద్రాల్లో వేసి, వర్మీ కంపోస్టుగా తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని తెలిపారు.

సాగునీటి కాలువ మరమ్మతుకు నిధులు మంజూరు



కాలువను పరిసీలిస్తున్న ఏఈ రవికుమార్

గొలుగొండ: ఏఎల్‌పురంలో ఉన్న బంగారంపేట చెరువు దిగువున పంట కాలువ మరమ్మతులకు రెండు లక్షల నిధులు మంజూరు అయినట్లు ఇరిగేషన్ ఏఈ రవికుమార్ తెలిపారు. ఆయన మంగళవారం కాలువను పరిసీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ దిగువున పంట భూములకు సాగునీరు సక్రమంగా అందలేదని, దీనికి కారణం కాలువలు సరిగ్గా లేకపోవడంతో నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

చీడికాడ: పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో హేమసుందర్ అన్నారు. మంగళవారం మండలంలోని చీడికాడ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్న పిల్లలు నమోదు, తప్పుల సవరణ చేసుకోవాలని ఆయన కోరారు. 23న చుక్కపల్లి, చీడికాడ, 24, 25 తేదీల్లో మంచాల మోడల్ స్కూల్‌లో ఆధార్ కేంద్రాల నిర్వహణ జరుగుతుందన్నారు.

ప్రకృతి సాగుతో మేలైన ఫలితాలు



కొరువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: రైతులు ప్రకృతి సాగుపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ అన్నారు. మండలంలో కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రకృతి సాగు విధానంలో పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సింగంపల్లి నారాయణమూర్తి, తోట భవానీ, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలంటూ వినతి



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

నర్సీపట్నం: డిపోలోని ఇసుక ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నేతల నాగేశ్వరరావు ఆర్డీవో కార్యాలయం ఏవో సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతుంది. గత ప్రభుత్వంలో నిల్వ చేసిన ఇసుక ఉచితంగా ఇవ్వకుండా డబ్బులు తీసుకోవటం సరికాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు గత ప్రభుత్వం చెల్లించిందని, రవాణా చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ నోరు అదుపులో పెట్టుకో



వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు ఈశ్వరరావు

నర్సీపట్నం: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌పై టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం మాజీ ఎమ్మెల్యే చేపట్టిన నిరసన ర్యాలీకి వచ్చిన స్పందన చూసి ఓర్వలేక మధు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని మా నాయకుడు రోడ్డు ఎక్కాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నర్సీపట్నంలో ప్రజలు రోడ్డు ఎక్కినందుకు సిగ్గుపడాలి అన్నారు.

81 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల సచివాలయం వద్ద మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో కంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు పరీక్షలు చేశారు. మొత్తం 81 మందిని పరీక్షించగా 35 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీరంరెడ్డి సత్యవతి, క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. మాకవరపాలెం మండల కేంద్రంలోని మహిళా మార్ట్ వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానికుల ఆనందం



మాడుగుల 4వ వార్డులో నిర్మించిన సీసీ రోడ్డు

మాడుగుల: మాడుగుల పట్టణం 4వ వార్డు నిధులతో చిన్నబ్బాయి డాక్టరు ఇంటి నుండి ప్రముఖ సిద్ధాంతి బమిడిపాటి శాస్త్రి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో సుమారు 50 కుటుంబాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వర్షం కురిస్తే ఈ రోడ్డు బురదమయంగా ఉండేదని, దీంతో నరకయాతన పడేవారమని ప్రజలు చెబుతున్నారు. ప్రస్తుతం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ఆనందంగా ఉందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ అయిన కార్యదర్శికి వీడ్కోలు

మాకవరపాలెం: బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శికి ఘన వీడ్కోలు పలికారు. మండలంలోని గిడుతూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న రాజారావుకు ఇటీవల బదిలీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనకు మంగళవారం సచివాలయంలో వైఎస్సార్‌సీపీ నేత, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మూకల బాలకృష్ణ, సర్పంచ్ రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభం



ఎం. కోటపాడు సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో అప్పారావు

మాడుగుల రూరల్ : ఆధార్‌లో తప్పొప్పులు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు చేసుకోవచ్చని ఎంపీడీవో కొంకి అప్పారావు పేర్కొన్నారు. మండలంలో మంగళవారం నుంచి ప్రారంభించిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల్లో ఆధార్ సేవలను ఆయన ప్రారంభించారు. మండలంలో ఎం.కోటపాడు, ఒమ్మలి, జాలంపల్లి, మాడుగుల-1, సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎం. కోటపాడు ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా ఈ ఈ ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఈ నెల 25 వ తేదీ వరకు పనిచేస్తాయని, ఎంపీడీవో తెలిపారు. ఈ నెల 23 న జి. అగ్రహారం, ఒమ్మలి, జె.డి.పేట, శంకరం సచివాలయాల్లో, 24న సత్యవరం, అవురువాడ, తాటిపర్తి సచివాలయాల్లో, వీజేపురం పంచాయతీ కార్యాలయంలో 25న ముకుందపురం, పొంగలిపాక, సాగరం, సచివాలయాల్లో, వీజేపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా సేవలు అందిస్తారని తెలిపారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నాగేశ్వర్రావు

రోలుగుంట: నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని తహసీల్దార్ వి.ఎస్. నాగేశ్వర్రావు వెలుగు గ్రామస్థాయి యాక్టివిస్టులు, ఏరియా సామాజిక కార్యకర్తలకు ఆదేశించారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వెలుగు ఏపీఎం ఉష ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉల్లాస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రాథమిక అక్షరాస్యత, నిరంతర అక్షరాస్యత, జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కేందాలు, సామాజిక భవనాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

బుచ్చెయ్యపేట: ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు అధికారులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు అన్నారు. మంగళవారం మండల వెలుగు సిబ్బంది రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వారోత్సవాల్లో పాల్గొన్న ఆయన ఆర్ అండ్ బి, రవాణా శాఖ, పోలీస్ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి, సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, మితిమీరిన వేగంతో ఎవరూ వాహనాలు నడపరాదని ఎస్ఐలు శ్రీనివాసరావు, భాస్కరరావు సూచించారు. ఈ సందర్భంగా బుచ్చెయ్యపేట మండల పరిషత్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీవో రాజునాయుడు తదితరులు పాల్గొన్నారు.

భవానీ భక్తుల నిధులతో రచ్చబండ నిర్మాణం



నూతనంగా నిర్మించిన రచ్చ బండపై కుర్చున్న పెద్దలు

చీడికాడ: మండలంలోని ఖండివరంలో భవానీ భక్తుల ఆర్థిక సహకారంతో రచ్చబండ నిర్మించినట్లు వైఎస్సార్‌సీపీ నేత, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన భవానీ భక్తులు రామాలయంలో ఆశ్రయం పొందారు. ఈ మేరకు రామాలయం ముందున్న వేప చెట్టు వద్ద తమ సొంత నిధులతో రచ్చబండ నిర్మించగా మంగళవారం దానిని ప్రారంభించి పెద్దలు కూర్చున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగంపల్లి ముత్యాలనాయుడు, కో–ఆప్షన్ సభ్యులు షేకు సూర్యనారాయణ, సుంకర కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన

చోడవరం: విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వినియోగదారులు చివరికి ధర్నాకు దిగారు. మండలంలో గోవాడ గ్రామంలో పలు ప్రాంతాల్లో కొంత కాలంగా తీవ్ర లో ఓల్టేజీ సమస్య ఉండటంతో గృహోపకరణాలు తరచూ కాలిపోయి మరమ్మతులకు గురవ్వడంతో వినియోగదారులు మంగళవారం ఆందోళన చేశారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడం వల్ల ఫ్యాన్లు, లైట్లు, ఇతర విద్యుత్ గృహోపకరణాలు కాలిపోతున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు చర్యలు తీసుకుని లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో గ్రామ ఉప సర్పంచ్ నక్కా త్రివేణి శ్రీనివాసరావు, అర్జునరావు, అప్పారావు, నక్కా లక్ష్మణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై గోతులతో ఇక్కట్లు

- తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు



బోల్తా పడిన వ్యాన్ నుంచి బయటికి వస్తున్న డ్రైవర్

రోలుగుంట: వడ్డాది–నర్సీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డులో భారీ గోతిలో పడి వ్యాన్ బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా బయటపడ్డాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట నుంచి నర్సీపట్నం వైపు అట్టల లోడుతో వస్తున్న వ్యాన్ మంగళవారం ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో మండల కార్యాలయం కూడలిలో ప్రమాదకరంగా ఉన్న భారీ గోతిలో బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్ బయటపడి స్నేహితులకు సమాచారం అందించాడు. అతని స్నేహితులు సంఘటనా స్థలానికి వచ్చి మరొక వాహనం సాయంతో వ్యాన్‌ను బయటికి తీశారు. ఇటువంటి ఘటనలు ఇక్కడ పరిపాటిగా మారాయి. ఇక్కడున్న గోతుల్లో వాహనాలు పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. కొత్త చెరువు మలుపు నుంచి స్థానిక కోపరేటివ్ బ్యాంకు వరకూ రోడ్డు వర్షాలకు నాని కోతకు గురయింది. మండల కార్యాలయాల కూడలి సమీపంలో గల చికెన్ సెంటర్ వద్ద ఒక లారీ కూరుకు పోయి గంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఈ నెల రెండో వారంలో నర్సీపట్నం ఆర్టీసీ డిపోకి చెంది బస్ 51 మంది ప్రయాణికులతో వెళ్తూ టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడే సమయంలో డ్రైవర్ చాకచక్యంతో అదుపు చేశాడు. ఇలా ఇక్కడ పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి కారణం శిథిలమైన రోడ్లే. దీనిపై స్థానికులు మాట్లాడుతూ సత్వరం గోతులు పూడ్చి ప్రమాదాలను నియంత్రించాలని కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు



దెబ్బతిన్న కారు ముందు భాగం

మాకవరపాలెం: మండలంలోని తామరం నుంచి మాకవరపాలెం శ్రీదేవి ఫంక్షన్ హాల్ వరకు సుమారు కిలోమీటరున్నర మేర ఐదేళ్ల క్రితం రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించారు. కానీ వీటికి రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్‌కు డివైడర్లు కనిపించక వాహనాలు వీటిని ఢీ కొడుతున్నాయి. మంగళవారం రాత్రి కూడా స్థానిక బస్టాండు వద్ద కారు డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో కారు ముందు భాగం దెబ్బతినగా లోపల ఎయిర్ బ్యాగ్స్ తెరచుకోవడంతో ఎవరికీ గాయాలు కాలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వీటి నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ఐదు గ్రామాల్లో ‘పల్లె పండగ’



మాట్లాడుతున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి: ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను గ్రామాల్లో త్వరితగతిన ప్రారంభించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. గరిశింగి, మారేపలి, చిననందిపల్లి, ఎస్.జి. నగరంలో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు ఆవిష్కరించి శంఖుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాత టీడీపీ నేతలకు పరాభవం..

మండలంలో జరుగుతున్న ‘పల్లె పండగ’ కార్యక్రమాల్లో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఘోర పరాభవం ఎదురవుతోంది. మారేపల్లిలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కిలి గోవింద్‌ను వేదిక పైకి పిలవకపోవడమే ఇందుకు నిదర్శనం. దేవరాపల్లిలో గ్రామ శాఖ అధ్యక్షుడు, సీనియర్ నాయకులకు సైతం సమాచారం ఇవ్వకుండా, వలస నేతలు తమ ఉనికిని చాటుకునేందుకు అత్యుత్సాహం చూపడం వల్ల ఆ పార్టీ పాత నేతలంతా గుర్రుగా ఉన్నారు.